క్లుప్తంగా

గంజాయి కేసులో నిందితుడి అరెస్ట్

తాటిచెట్లపాలెం: గంజాయి కేసులో తప్పించుకు తిరుగుతున్న ముద్దాయిని గవర్నమెంట్ రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జీఆర్పీ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం... జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఆర్పీఎఫ్ ఎస్ఐ షేక్ అబ్దుల్ మారూఫ్ సిబ్బందితో కలిసి రైల్వేస్టేషన్‌లో మంగళవారం తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా గంజాయి కేసులో తప్పించుకు తిరుగుతున్న ముద్దాయి ఒడిశా రాష్ట్రంలోని కోరాపుట్ జిల్లాకు చెందిన అనిల్ మచ్చను అదుపులోకి తీసుకున్నారు. గంజాయి తరలించేందుకు రెక్కీ నిర్వహిస్తుండగా ఆర్పీఎఫ్ సిబ్బంది అదుపులోకి తీసుకుని జీఆర్పీ సిబ్బందికి అప్పగించారు. నిందితుడిని రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచారు.

ఎమ్మెల్యేకి కేంద్ర మంత్రి పరామర్శ



కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌తో ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

సీతమ్మధార: కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజును కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ మంగళవారం పరామర్శించారు. ఈ మేరకు సీతమ్మధార దరి బాలయ్యశాస్త్రి లే అవుట్ వద్ద గల ఎమ్మెల్యే నివాసంలో ఆయనను కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే త్వరగా కోలుకోవాలని మంత్రి ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీవీఎన్ మాధవ్, సీతా సుజాత, పృథ్వీరాజ్, శ్యామలా దీపిక, సునీల్ అగర్వాల్ పాల్గొన్నారు.

పోగొట్టుకున్న ఫోన్ అప్పగింత



ప్రయాణికుడికి ఫోన్ అప్పగిస్తున్న ఆర్పీఎఫ్ సిబ్బంది

తాటిచెట్లపాలెం: రైలులో ప్రయాణిస్తూ జారవిడుచుకున్న ఫోన్‌ను రైల్వే భద్రతా దళం సిబ్బంది గుర్తించి సదరు ప్రయాణికుడికి అప్పగించారు. ఆర్పీఎఫ్ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం... ఈ నెల 28న విశాఖపట్నం – కిరండూల్ స్పెషల్ (08551)లో అరకు వెళ్తున్న ఓ ప్రయాణికుడు రామ్మూర్తిపంతులుపేట మర్రిపాలెం మధ్యలో ఫోన్ జారవిడుచుకున్నాడు. సదరు ప్రయాణికుడు వెంటనే రైల్ మదద్ పోర్టల్‌లో ఫిర్యాదు చేశాడు. ఆర్పీఎఫ్ ఏఎస్ఐ కేఆర్‌కే రావు, కానిస్టేబుల్ కె.అప్పారావు ట్రాక్‌లపై వెతగ్గా ఫోన్ దొరికింది. వెంటనే సదరు ఫిర్యాదుదారునికి సమాచారం అందించి ఫోన్‌ను మంగళవారం అందజేశారు.

ప్రమాదాల మలుపులు..!

అభివృద్ధికి నోచుకోని రహదారులు • చీకటి వేళ మలుపుల్లో ప్రమాదాలు • పట్టించుకోని జీవీఎంసీ అధికారులు



తాటిచెట్లపాలెం నుంచి కంచరపాలెం వెళ్లే మలుపు మార్గంలో వాహనాల రాకపోకలు ఇలా.

కంచరపాలెం : జీవీఎంసీ 54, 55వ వార్డుల పరిధి కంచరపాలెం కూడలి నుంచి తాటిచెట్లపాలెం వెళ్లే రహదారి, ధర్మానగర్, తిక్కవానిపాలెం వద్ద బీఎస్‌టీఎస్ 1 కాలనీల వద్ద రహదారిలో ఉన్న మలుపులు ప్రమాదాలకు నిలయంగా మారాయి. ఇటు కంచరపాలెం నుంచి జ్ఞానాపురం భారతీయ ఆహార గిడ్డంగి రహదారి మీదుగా లోకో షెడ్ వాషింగ్‌లైన్‌కు వెళ్లే రహదారులు ప్రమాదాలకు నిలయంగా మారాయి. ఈ మార్గాల్లో ప్రయాణమంటే వాహనచోదకులు, పాదచారులు, స్థానికులు భయాందోళన చెందుతున్నారు. అటూ ధర్మనగర్, తిక్కవానిపాలెం, తాటిచెట్లపాలెం జాతీయ రహదారి, గంగన్ననగర్, జోగారావునగర్ రైల్వే క్వార్టర్స్, ఇటు కంచరపాలెం కూడలి ప్రాంతాలకు ఇదే ప్రధాన రహదారి. రోడ్లపై భారీ వాహనాలు పార్కింగ్ చేస్తుండడంతో వంద అడుగుల రహదారి కాస్తా 60 అడుగులకు కుచించుకుపోయింది. రహదారిలో విద్యుత్ లైట్లు లేకపోవడం, అధిక మలుపులు ఉండడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. రైల్వే వాషింగ్ లైన్‌కు వెళ్లే రహదారిలో విద్యుత్ దీపాలు లేకపోవడంలో రాత్రి వేళ చీకట్లో ప్రయాణం చేసేటప్పుడు భయాందోళన చెందుతున్నామని స్థానిక కాలనీల ప్రజలు వాపోతున్నారు. ఇటీవల ఈ మలుపుల్లో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరిగాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



లైట్లు లేని విద్యుత్ స్తంభాలు



చీకటి రహదారుల్లో నిత్యం వాహనదారుల రాకపోకలు

ఐదో పట్టణ ట్రాఫిక్ పోలీసులు నిర్లక్ష్యంగా ప్రమాదకర మలుపులను సూచించే హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయలేదని పలువురు ఆరోపిస్తున్నారు. నిత్యం ట్రాఫిక్ కేసుల నమోదుపై ఉన్న ఉత్సాహం హెచ్చరిక బోర్డుల ఏర్పాటుపై ఉంటే బాగుంటుదని వాహనదారులు, పాదచారులు అంటున్నారు. తాటిచెట్లపాలెం నుంచి కంచరపాలెం నేతాజీ ఫ్లైఓవర్ కూడలికి రాకపోకలు సాగించే వాహనదారులు చీకట్లో ప్రయాణం చేస్తున్నారు. విద్యుత్ స్తంభాలు ఉన్నా లైట్లు ఏర్పాటు చేయకపోకడంలో అధికారుల నిర్లక్ష్యం కనిపిస్తోందని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు సమస్యలపై తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



కంచరపాలెం కూడలి మలుపు రహదారిలో ఇలా...



కంచరపాలెం కూడలి మలుపు మార్గంలో గోతుల రహదారి

హెచ్చరిక బోర్డులు లేవు



కంచరపాలెం కూడలి నుంచి వెళ్లే రహదారుల్లో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. చీకటి పడితే రాత్రి సమయంలో ప్రమాదాలు మరీ విపరీతంగా జరుగుతున్నాయి. విద్యుత్‌లైట్లు లేకపోవడంతో చీకట్లో ప్రయాణం సాగిస్తున్నారు. పోలీస్ అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి.

–పి.సురేష్‌కుమార్, వాహనదారుడు, కంచరపాలెం

చీకట్లో రాకపోకలు సాగిస్తున్నాం



తాటిచెట్లపాలెం నుంచి రైల్వేస్టేషన్ వైపు వెళ్లాలంటే ఈ రహదారినే వినియోగిస్తున్నాం. ఈ రహదారిలో రాకపోకలు సాగించలేకపోతున్నాం. విద్యుత్ స్తంభాలు ఉన్నా లైట్లు ఏర్పాటు చేయకపోవడంతో చీకట్లో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయాలి.

– కె.సాయిరామ్, వాహనదారుడు, మర్రిపాలెం.

విద్యుత్ చార్జీల పెంపుతో సామాన్యులపై భారం



ఏపీఈపీడీసీఎల్ ప్రధాన కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు, కార్యకర్తలు

సీతమ్మధార: రాష్ట్ర ప్రభుత్వం దీపావళి కానుకగా రూ.6,078 కోట్ల మేర పెంచిన విద్యుత్ చార్జీల వల్ల సామాన్య ప్రజలపై తీవ్రమైన ఆర్థిక భారం పడుతోందని, తక్షణమే పెంచిన చార్జీలు రద్దు చేయాలని సీపీఐ విశాఖ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు డిమాండ్ చేశారు. విద్యుత్ చార్జీల పెంపును వ్యతిరేకిస్తూ గురుద్వారా సమీపంలోని ఏపీఈపీడీసీఎల్ ప్రధాన కార్యాలయం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా పైడిరాజు మాట్లాడుతూ సామాన్య కుటుంబాలు, రైతులు, చిన్న వ్యాపారులు ఇప్పటికే ధరల పెరుగుదలతో సతమతమవుతున్నారన్నారు. ఈ పరిస్థితుల్లో విద్యుత్ చార్జీలు నవంబర్ ఒకటి నుంచి యూనిట్‌కు రూ.1.58ల పెంపు వల్ల వారి జీవనోపాధి మరింత కష్టతరంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. చార్జీల పెంపుతో ఉమ్మడి విశాఖ జిల్లాలోని 25 లక్షల మంది వినియోగదారులపై అదనంగా రూ.15 కోట్ల భారం పడుతుందని తెలిపారు. చార్జీల పెంపు పారదర్శకంగా లేకపోవడం వల్ల సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం జనరల్ మేనేజర్ వి.విజయలలితకు సీపీఐ ప్రతినిధి బృందం వినతిపత్రం అందజేసింది. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.సత్యాంజనేయ, జీఎస్‌జే అత్యుతరావు, కె.సత్యనారాయణ, ఎస్‌కే రెహమాన్, ఎం.మన్మధరావు, ఆర్.శ్రీనివాసరావు, సీఎన్ క్షేత్రపాల్ రెడ్డి, ఎంఏ బేగం, కె.వనజాక్షి, ఎ.దేముడమ్మ, బి.పుష్పలత, కె.అచ్యుతరావు, వై.రాంబాబు, ఎస్.అప్పన్న, కె.లక్ష్మణరావు, సీహెచ్ కాసుబాబు, ఎస్.సూరిబాబు, ఎం.శ్రీనివాసరావు, ఎ.రవి, జి.కాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణహితంగా దీపావళి

మురళీనగర్: దీపావళి పండగను పర్యావరణహితంగా జరుపుకోవాలని కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇన్‌స్టిట్యూట్ (గైస్) ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ సూచించారు. బీఎస్‌ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గైస్‌లో పర్యావరణహిత దీపావళిపై విద్యార్థులకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రేకర్లు, ఎక్కువ శబ్దాన్నిచ్చే ప్రమాదకర బాంబులు, ఇతర మందుగుండు సామగ్రి వాడొద్దని సూచించారు. బాణసంచా కాల్చడం వల్ల వెలువడే పొగ ఆరోగ్యానికి హాని చేస్తుందన్నారు. కాకర పువ్వొత్తులు, ఇతర బాణసంచా కాల్చినప్పుడు తప్పనిసరిగా కళ్లద్దాలు, చెప్పులు, బూట్లు ధరించాలని సూచించారు. అనంతరం 'మన దీపావళి... మన పర్యావరణం' అనే అంశంపై నిర్వహించిన వకృత్వ పోటీలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వాసు, తన్వీర్, సాయితనుశ్రీ మొదటి మూడు స్థానాల్లో విజేతలుగా నిలిచారు. వీరికి బహుమతులు, ప్రశంసాపత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఇంటర్నేషనల్ ఎక్సలెన్స్ అవార్డు గ్రహీత ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణను బీఎస్‌ఆర్ ఫౌండేషన్ తరఫున ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎల్.కృష్ణారావు, ఎం.సుజాత, బీటీ స్వామి, జీవీ కృష్ణారావు పాల్గొన్నారు.



సాయితనుశ్రీకి బహుమతి అందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ రమణ, బీఎస్‌ఆర్ ప్రతినిధులు

మోకా విజయ్‌కుమార్‌కు సత్కారం

తాటిచెట్లపాలెం: రైల్వే ఉద్యోగి, కళాకారుడు మోకా విజయ్‌కుమార్‌ను వాల్తేర్ డివిజన్ డివిజినల్ రైల్వే మేనేజర్ సౌరభ్‌ప్రసాద్ మంగళవారం తన చాంబర్‌లో సత్కరించారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో మోకా విజయ్‌కుమార్ 24 అడుగుల పొడవైన కాన్వాస్‌పై చిత్రీకరించిన ప్రత్యేక చిత్రం మూడు రికార్డులు సొంతం చేసుకుంది. రైల్వే వీక్ వేడుకల్లో మూడు రాష్ట్రాల (ఆంధ్రప్రదేశ్, ఒడిశా, ఛత్తీస్‌ఘడ్) సంస్కృతుల మీద 'మూడు రాష్ట్రాలు – మూడు సంస్కృతులు – ఒక్క డివిజన్' థీమ్‌తో తయారుచేసిన చిత్రం రికార్డులు సాధించింది. ఈస్ట్‌కోస్ట్‌రైల్వే వాల్తేర్ డివిజన్ డీజిల్ లోకో షెడ్‌లో విధులు నిర్వర్తిస్తూ గతంలో పలు ప్రత్యేక కళాఖండాలు తయారుచేసి పలువురి ప్రశంసలను విజయ్‌కుమార్ అందుకున్నారు. ఈ నేపథ్యంలో డీఆర్‌ఎం ప్రత్యేకంగా శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఏడీఆర్‌ఎం మనోజ్‌కుమార్‌సాహూ, సీనియర్ డివిజినల్ ఇంజినీర్ ఏకే మహారాణా, సీనియర్ డివిజినల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ పాల్గొన్నారు.



విజయ్‌కుమార్‌తో డీఆర్‌ఎం సౌరభ్‌ప్రసాద్, తదితరులు

దీర్ఘకాలిక ఆర్థికవృద్ధికి బాటలు వేయాలి

ఆంధ్రప్రదేశ్ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ డీవీఎస్‌ఎస్ సోమయాజులు

సీతంపేట: భారతదేశ పారిశ్రామిక ఉత్పత్తి ప్రస్తుత యూఎస్‌ఏ ఉత్పత్తి కంటే ఎక్కువగా ఉందని, యూఎస్‌లో మెరుగైన సంస్థలు ఏర్పడినందున ఆ దేశం అభివృద్ధి చెందిందని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ డీవీఎస్‌ఎస్ సోమయాజులు అన్నారు. సొసైటీ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ అండ్ రీసెర్చ్ (సిడార్), లంకపల్లి బుల్లయ్య కళాశాల సంయుక్తంగా మంగళవారం కళాశాలలో 'నోబెల్ బహుమతి గ్రహీతల సహకారం 2024, ఆర్థిక శాస్త్రం, భారతీయ సంస్థలు, అభివృద్ధి, ప్రజాస్వామ్యం' పై చర్చ జరిగింది. దేశ శ్రేయస్సు, ఆర్థిక అభివృద్ధిని సంస్థలు ఎలా ప్రభావితం చేస్తాయి తదితర విషయాలపై పలువురు మేధావులు చర్చించారు. ఈ సందర్భంగా సోమయాజులు మాట్లాడుతూ వ్యాపార, వాణిజ్య సంస్థలు , పరిశ్రమలు దేశానికి మద్దతుదారులని పేర్కొన్నారు. ప్రొఫెసర్ కె.సి.రెడ్డి మాట్లాడుతూ దీర్ఘకాలిక ఆర్థికవృద్ధికి సంస్థలు ప్రాథమిక కారణమన్నారు. బుల్లయ్య కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ జి.మధుకుమార్ మాట్లాడుతూ సోషల్ మీడియా ప్రభావంతో అందరూ దూరమవుతున్న సమాజంలో మళ్లీ చర్చా కార్యక్రమాలు నిర్వహించడం శుభపరిణామమన్నారు. ప్రొఫెసర్ డి.హరినారాయణ మాట్లాడుతూ సెక్యులర్ కాలనీలు అసాధారణ సంస్థలను ఆకర్షిస్తాయన్నారు. ఆచార్య వి.బాలమోహన్‌దాస్ మాట్లాడుతూ దేశంలో ఆర్థిక సంస్కరణలు తీసుకొచ్చిన మాజీ ప్రధానులు పి.వి.నరసింహారావు, మన్మోహన్ సింగ్ సేవలను కొనియాడారు. ప్రొఫెసర్ ఎ.ప్రసన్నకుమార్ మాట్లాడుతూ దేశం అభివృద్ధి చెందాలంటే సోదర భావం ముఖ్యమన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్స్, లెక్చరర్స్, ఎకనామిక్స్ ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆంధ్రప్రదేశ్ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ డీవీఎస్‌ఎస్ సోమయాజులు

మద్యం మత్తులో ఎస్ఐ హల్‌చల్..?

సీతమ్మధార: బాధ్యతాయుతంగా రాత్రి గస్తీ నిర్వహించాల్సి ఓ ఎస్ఐ మద్యం మత్తులో ఓ వ్యక్తిని దుర్భాషలాడి ఫోన్ లాక్కున్న ఉదంతం నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చీ దృష్టికి వెళ్లింది. ఆదివారం రాత్రి జరిగిన సంఘటనపై రక్షక్ డ్రైవర్ (హోం గార్డు) నుంచి వివరాలు సేకరించారు. సీపీ సేకరించిన సమాచారం ప్రకారం... ఆదివారం రాత్రి దొండపర్తి జంక్షన్‌లో ఓ వ్యక్తి ఫోన్‌లో మాట్లాడుతుండగా అదే ప్రాంతంలో రాత్రి గస్తీ నిర్వహిస్తున్న ఎస్ఐ నర్సింగరావు గమనించి... ఫోన్ లాక్కుని దుర్భాషలాడారు. నీకు దిక్కున్నచోట చెప్పుకో అంటూ హెచ్చరించారు. స్థానికులు సర్దిచెప్పినప్పటికీ వినిపించుకోకుండా మద్యం మత్తులో ఊగిపోయారని రక్షక్ వాహనం డ్రైవర్ సీపీకి చెప్పారు. ఈ ఘటనపై బాధితుడి నుంచి ఫోర్తుటౌన్ పోలీసులు ఇప్పటికే స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. రాత్రి వేళ మద్యం సేవించిన వారిని ప్రశ్నించాల్సిన పోలీసులే మద్యం సేవించి ప్రజలపై రెచ్చిపోవడాన్ని సీపీ సీరియస్‌గా తీసుకున్నారని తెలిసింది.

ఘనంగా జాతీయ ఐక్యతా దివస్



ఐక్యతా పరుగు పోటీలు ప్రారంభిస్తున్న పోర్ట్ చైర్మన్ డాక్టర్ అంగముత్తు



ఎర్రా జ్యోతికి రూ.5 లక్షల చెక్కు అందజేస్తున్న పోర్ట్ చైర్మన్ అంగముత్తు

కంచరపాలెం: జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని విశాఖ పోర్ట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సాలిగ్రామపురంలోని పోర్ట్ సీఐఎస్‌ఎఫ్ కాంప్లెక్స్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోర్ట్ చైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు మాట్లాడుతూ భారతదేశాన్ని ఏకీకృతం చేయడంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ చేసిన కృషిని స్మరించుకున్నారు. దేశ సార్వభౌమత్వాన్ని, ఐక్యతను ప్రతిబింబించేలా పాటుపడాలన్నారు. పోర్ట్ సీఐఎస్‌ఎఫ్ యూనిట్ – పోర్ట్ క్రీడా విభాగం సంయుక్త ఆధ్వర్యంలో ఐక్యతా పరుగు పోటీలను ఆయన జెండా ఊపి ప్రారంభించారు.

అనంతరం భారత్ నుంచి ఒలింపిక్స్‌కు ప్రాతినిధ్యం వహించిన పోర్ట్ హైస్కూల్ పూర్వ విద్యార్థిని, యూత్ ఐకాన్ జ్యోతి ఎర్రాజీని చైర్మన్ ఘనంగా సత్కరించారు. భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించేందుకు ప్రోత్సాహకం కింద రూ.5 లక్షల చెక్ ఆమెకు అందజేశారు. ఐఆర్‌టీఎస్ డిప్యూటీ చైర్మన్ దుర్గేష్‌కుమార్, సీఐఎస్‌ఎఫ్ కమాండెంట్ సతీష్‌కుమార్, ఆయా విభాగాధిపతులు, ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీచ్‌రోడ్డులో విజిలెన్స్ వారోత్సవాలు



ప్రతిజ్ఞ చేస్తున్న సీబీఐ సిబ్బంది

ఏయూక్యాంపస్: విజిలెన్స్ వారోత్సవాలలో భాగంగా బీచ్‌రోడ్డులో అవగాహన ర్యాలీని మంగళవారం నిర్వహించారు. ఆర్‌కే బీచ్ వద్ద సీబీఐ సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎస్.పి మురళీ లాంబ విచ్చేసి ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ప్లకార్డులు చేతబూని అవినీతికి దూరంగా ఉండాలని, అవినీతిని ప్రోత్సహించరాదని, అవినీతిని నిర్మూలించాలని నినాదాలు చేశారు. అనంతరం బీచ్‌రోడ్డులో కరపత్రాలను పంపిణీ చేశారు. ఓరియంటల్ ఇన్సూరెన్స్ సంస్థ సిబ్బంది ఆధ్వర్యంలో విజిలెన్స్ వారోత్సవాలను పురస్కరించుకుని ర్యాలీ జరిపారు. ర్యాలీలో సంస్థ డీజీఎం కె.కోటేశ్వర రావు, ఆర్‌ఎం పి.సతీష్ బాబు, టి.టి.వి రామం, మేనేజర్ ఎస్.రామానుజన్, విజిలెన్స్ అధికారి ఎస్.ఎస్.కె మోహన రావు తదితరులు పాల్గొన్నారు.

పీఎంశ్రీ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి

మహారాణిపేట: కెమిస్ట్రీ ల్యాబ్‌లు, ఆటస్థలాల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, ప్లే గ్రౌండ్, ఫర్నిచర్ లేని పాఠశాలల వివరాలు సేకరించాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ సూచించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన జిల్లా స్థాయి సమావేశంలో ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎంశ్రీ)పై వివిధ ప్రభుత్వ శాఖలు, మండల విద్యాశాఖ అధికారులు, పీఎంశ్రీ స్కూల్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ప్రధాన మంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా ప్రోగ్రామ్ కింద 5 పాఠశాలలను గుర్తించినట్లు తెలిపారు. ఈ పాఠశాలలకు కెమిస్ట్రీ ల్యాబ్‌లు, ప్లేగ్రౌండ్లు, పాఠశాలల నిర్వహణకు కాంపోజిట్ స్కూల్ గ్రాంట్ విడుదల జరిగిందన్నారు. కెమిస్ట్రీ ల్యాబ్‌లు, ప్లేగ్రౌండ్లు త్వరగా పూర్తి చేయాలని ఇంజినీరింగ్ శాఖను ఆదేశించారు. అలాగే నిర్దేశించిన విధంగా 5 పాఠశాలల్లో తాగునీరు, టాయిలెట్లు, ఫర్నిచర్, ఇంటర్నెట్, ల్యాబ్‌లు తదితర 21 రకాల వసతులు తప్పనిసరిగా కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి ప్రేమకుమార్, జిల్లాస్థాయి అధికారులు, అసిస్టెంట్ ఏఎంవో లక్ష్మి, మండల విద్యాశాఖ అధికారులు, పిఎంశ్రీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

వెస్ట్ సబ్ డివిజన్ పోలీసులకు నాలుగు రివార్డులు

మర్రిపాలెం: వెస్ట్ సబ్ డివిజన్ పరిధిలో పలు చోరీ కేసుల్లో త్వరితగతిన రికవరీలు పూర్తి చేసి బాధితులకు అప్పగించడంతో కంచరపాలెం క్రైం సీఐతోపాటు సిబ్బందికి రివార్డులను నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి మంగళవారం అందజేశారు. పెందుర్తి, గోపాలపట్నం, ఎయిర్‌పోర్ట్ జోన్, కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో చోరీ కేసుల్లో నిందితులను పట్టుకుని వారు అపహరించిన బంగారం, వెండి వస్తువులను స్వాధీనం చేసుకుని బాధితులకు అప్పగించినందున మొత్తం నాలుగు రివార్డులను సీపీ అందజేశారని క్రైం సీఐ నిమ్మకాయల శ్రీనివాసరావు తెలిపారు.



కంచరపాలెం క్రైం సీఐకు రివార్డు అందిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి

ఎంఎస్ఎంఈ చైర్మన్‌కు సత్కారం

సీతంపేట: ఎంఎస్ఎంఈ చైర్మన్‌గా నియమితులైన జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని శివశంకర్‌ను ఆ పార్టీ నగర అధ్యక్షుడు, ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మంగళవారం ఘనంగా సత్కరించారు. సీతంపేటలోని పార్టీ కార్యాలయంలో దక్షిణ నియోజకవర్గ ఇన్‌చార్జి శివప్రసాద్‌రెడ్డి పర్యవేక్షణలో మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా వంశీకృష్ణ మాట్లాడుతూ పార్టీ కోసం నిరంతరం పాటుపడిన విద్యావేత్తకు ఈ పదవి ఇవ్వడం సంతోషకరమన్నారు.



శివశంకర్‌ను సత్కరిస్తున్న వంశీకృష్ణ

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు సిబ్బంది పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మి ఆలయంలో ఆయుస్సు హోమం..

ప్రతి నెలా ఉత్తరా నక్షత్రం రోజున కనకమహాలక్ష్మి ఆలయంలో నిర్వహించే ఆయుస్సు హోమం మంగళవారం నిర్వహించారు. దేవస్థాన వేద పండితులు, అర్చక స్వాములు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈవో, ఏఈవో, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.